## ౨౪

# వెలిసిపోయిన పెళ్ళిఫొటో

ఫ్రేము వూడిపోయిన పటాలు కొన్ని ఇంట్లో ఏదో మూల పారేశాము. ఆ జంకులో ఈ మధ్య ఏదో వెలిసిపోయిన అట్టలాక్కొచ్చి దానికో క్లిప్పు పెట్టి పరీక్షలు రాసుకుంటున్నాడు రాము. తీరా పరీక్షగా చూద్దును గదా - అది మన పెళ్ళి ఫొటో: వెలిసిపోయి వెలవెల బారుతూ వున్న అట్టమీద మనల నిద్దర్నీ ఒకచోట నిలబెట్టి బిగపెట్టి చెక్కు చెదరకుండా అంటించాడు ఎవడో ఫొటోగ్రాఫరు. మనమిద్దరమూ ఎక్కడికేనా పారిపోతామేమో నన్న భయంతో కాబోలు పెద్దవాళ్ళు చెంగూ చెంగూ గట్టిగా ముడే

శారు. అందులో బుట్టబొమ్మలాగ నాకు బెనారస్ పట్టుచీరకట్టబెట్టి మెడ నిండా వాళ్ళవీ వీళ్ళవీ నగలు తెచ్చి దిగేశారు. మీరు మోకాళ్ళ క్రిందికి చొక్కా తొడుక్కున్నారు. మెళ్ళో కర్పూరపు పలు చెమ్కీ దండలు వేశారు. చొక్కాకి క్రిమిన్స్ గుండీలు. కాలరుకి క్రిమిన్స్ పిన్ను పెట్టుకున్నారు నేను కొంచంపొట్టి అని నన్ను ఎత్తుమీద నిల్చో పెట్టారు. మీరు గోతిలో నుంచున్నట్లు వున్నారు. చూపులో కొంచెం మెల్లవున్నట్లు వుంది. ఆతోటలో ఆ వేళ ఆచెట్టు కింద ఎత్తుపల్లాలో మనల్ని నిల్చొపెట్టి ఎవడో చేతగాని ఫొటోగ్రాఫరు పెళ్ళి ఫోటో తీశాడు. మనమిద్దరం ఆరోజు ఆక్షణం ఆఫొటోగ్రాఫరు చేతిలో భవూస్లులా చిక్కడ్డాం. మీరు ఆశగా ఆకాశం లోకి చూస్తున్నట్లున్నారు. నేను సిగ్గుతో నేలచూపులు చూస్తున్నాను. ఆ ఏడే మీ ఇంటర్మీడు పరీక్ష చెట్టెక్కుతుందనీ శుభ్రంగా ఆనర్స్ చదివి ఏ లెక్చరరుగానో వెళ్ళవలసిన మీరు రయిల్వే గుమాస్తాగా మారి పోతారని మీకుతెలీదు. నాలుగైదేళ్ళలో ఇద్దరు ముగ్గురు పిల్లలు పుట్టుకొచ్చేసి పువ్వులా గుమగుమలాడి పోవలసిన జీవితం నలిగి నాశనమయి "ఫిట్లు" వస్తాయని అడుగేస్తే పడిపోతానని నాకుతెలీదు.

ఈ వెలిసిపోయి వెల వెలబారిపోతున్న పెళ్ళిఫొటో చూస్తుంటే మన పెళ్ళి ముచ్చట్లు గుర్తొస్తున్నాయి. మీరు నేను కనుపించకూడదట. అందుకని పొరపాటున మీరు ఎదురుపడితే తలుపులు ద్వారబంధాలు అడ్డుచూచుకోకుండా పాకుతూ గెంతుతూ పరిగెత్తిపోయేదాన్ని. ఓరోజు మానాన్న ఇంకోమూర ఎక్కువచేసి నందుకు అరుగుమీద తైమని ఎగుర్తూ వంట బ్రాహ్మల్ని బూతులు తిడుతూ కాలభైరవుడిలా విజృంభించడం నాకుగుర్తుంది. ఆడబడుచు లాంచనాలు మరోక ర్0 ఎక్కువ అడిగినందుకు మానాన్న గింజుకుంటే మీవాళ్ళు మిమ్మల్ని విడిదిలోకి తీసికెళ్ళి దాచే

శారు, అప్పుగింతల బట్టలు పెట్టినప్పుడు అందరికీ బట్టలు పెట్టలేము. సావిట్లోంచి పెద్దమామయ్యగారు లేచి వెళ్ళిపోతుంటే మామయ్యగారు చిన్నబుచ్చుకున్నారు. మీకేమీ కట్నమూ, కానుకాలూ ఇవ్వకపోగా చిన్న చిన్న లాంఛనాల దగ్గర మావాళ్ళు వెలితిపడ్డం మీకందరికీ కోపాలు రావడం నాకు ఇప్పటికి బాగా గుర్తు.

ఇంటిముందు రోడ్డుమీద పందిరివేసి పెళ్ళిచేశారు. ఆపెళ్ళిలో మానాన్న హడావిడి కేకలు కంగారూ తప్ప, నాకింకేంగుర్తులేవు. ఆనప సాపురం కాలవగట్టు. ఊళ్లో కొబ్బరి చెట్లనీడను నడిరోడ్డులో తాటాకుల పందిరిక్రింద చల్లగా మన పెద్దలుమనకు పెళ్ళిచేసి మీపాట్లు మీరు పడం డని జీవితంలోకి పడవను నీళ్ళల్లోకి త్రోసినట్లు తోశారు. మనిద్దరినీ ఒక కంచంలో భోంచెయ్యమన్నారు. రూపాయ లాట. చెండ్లు విసరటంలాంటి వేడుకలు జరిపారు. ఆడవాళ్ళు వదినలు, అక్కయ్యలు, పిన్నిగార్లు ఎన్నో పాటలు పాడారు. బహుమతు లిచ్చారు. ఆశీర్వదించారు. అందరి కాళ్లకూ వంగి లేచి దండాలు పెట్టేసరికి నడుంపడి పోయిందనుకోండి.

అప్పటికి ఇంకా చిన్న పిల్లలమేగా—వీధిలో చెరో వంట బ్రాహ్మడూ మనల్ని ఎత్తుకుని "జంఝునక" "జంఝునక" అంటూ అడుగులు వేస్తూ బుక్కాజల్లుకున్నారు.

ఆ దండాడింపు తలుచుకుంటూంటే ఇప్పటికి నాకు నవ్వొస్తుంది. మనకంటె వంట బ్రాహ్మలు బుక్కా ఎక్కువ చల్లుకున్నారు. మీరు నాకళ్లల్లో బుక్కా పొసేశారు. నేను దిగి పోదామనుకున్నా వంట బ్రాహ్మలు వో అరగంట దింపకుండా నన్ను ఎత్తుకొని గంతులు వేశారు. ఇప్పుడు ఏ పెళ్ళికూతురిని ఏ వంట బ్రాహ్మడు ఎత్తుకోగలడు? ఆ వేళ మనల్ని ముత్యాల పల్లకిలో కూర్చోపెట్టి వూరేగించారు. పాలకొల్లు నించి తెచ్చిన సన్నాయి మేళం నాటపదహార్లూ పుచ్చుకుని కృతులూ.

తరంగాలు జగన్మోహనంగా దేవదుందుభులు మ్రోగేలా వాయించారు. పెద్దలూ పేరంటాళ్ల మధ్య పల్లకీలో వూరేగినట్లు రోజులు సాగిపోవాలనుకుంటే మనవల్ల నవుతుందా? ఎన్ని బాధలు? ఎన్ని కష్టాలు? ఎన్ని కన్నీళ్లు! ఎన్ని నిట్టూర్పులు. జీవితమంటే—మల్లెపూలతోనూ మంచి గంధం తోనూ ప్రారంభ మవుతుందనుకున్న మన జీవితం పాల డబ్బాలతో ప్రారంభ మయింది. దేశంకాని దేశంలో ఉద్యోగం - బొటాబొటి జీతం - ఐదురూపాయల ఇంటద్దె ఇచ్చి అందరి వెనకాలవున్న కూలిపోబోతున్న ఒంటి గదిలో అర్ధరాత్రి కొరివిదయ్యాల్లా కనిపించే దీపాల్ని చూస్తూ మట్టినేల అలుక్కుంటూ నులకమంచంతుక్కులో కాపురం చేస్తామని అనుకోలేదు గదా! అప్పుడు జీవితం మొదట్లో అది దుర్భరదారిద్ర్యమని మనకు తెలియదు. వయసూ సొగసూ వలపూ ఈ మూడింటి ముందు డబ్బు ఆస్తి అంతస్తు దమ్మిడీకి కొరగావని ఢంకా బజాయించి చెప్తాను. మనకు గల అనురాగం అభిమానాలే పెట్టని కోట. లేకపోతే మనం ఏనాడో ఆత్మహత్య చేసుకోవలసిన వాళ్ళం.

ఆపేక్షలూ అంతఃకరణలూ లేకపోతే ఈ సంసారంలో నెగ్గుకు రాగలవా? మీరు ఇంటికి ఆలస్యంగా వచ్చేవారు. సిగరెట్లు తెగ కాల్చేవారు. నాటకాలు వేయిస్తూ, క్లబ్బులనీ, సంఘాలనీ దిక్కుమాలిన తిరుగుళ్ళన్నీ తిరిగే వారు. అలా నన్ను. చంటిపిల్లలినీ దిక్కుమాలిన కొంపలో పడేసి అర్ధరాత్రీ అపరాత్రీ వస్తూంటే నేను మీతో పోట్లాటవేసుకునే దాన్ని. అదపా తదపా రెండు తగలనిచ్చేవారు. పెళ్ళినాడు మీరు నా మెళ్లో కర్పూరదండ వేసినప్పుడు, తరువాత ఆ చేత్తోనే ఈ లెంపా, ఆ లెంపా రెండూ వాయిస్తారని పిచ్చిముద్దుని నాకేం తెలుసు? మా నాన్న మా అమ్మని చెడ్డదెబ్బలు కొట్టేసేవాడు. అంత ఎక్కువగా దెబ్బలు

కొట్టకుండా అప్పుడప్పుడు లెంపకాయలు మాత్రమే కొట్టినందుకు మీకు మనసులో ధన్యవాదాలు చెప్పుకునేదాన్ని.

కాపురమంటే మొగుడిచేత మొట్టికాయాలూ, చెంపదెబ్బలు తినకుండా వెళ్తుందా? రెండు దెబ్బలు తింటేనే అనుబంధాలు గట్టిపడతాయనేది మా అమ్మమ్మ మా ఊళ్లో ఒకాయన పెళ్ళాన్ని గొడ్డును బాదినట్లు బాది వొంటిమీద చీరనుకూడా లాక్కుని చీకట్లో తలుపుతీసి దొడ్లోకి గెంటేసే వాడు! ఆ ఇల్లాలు చీకట్లో. చలిలో భయంతో చెట్ల మధ్యన. నూతి ప్రక్కన కూర్చుని తెల్లవార్లూ దీనంగా ఏడుస్తూ వుండేది. ఇది అధర్మం? ఇది దారుణం! అని ఎవరూ అనేవారు కారు. ఆవిడ నూతిలోపడి చచ్చిపోయింది. నెల తిరక్కుండానే ఆ ముండాకొడుకు మళ్లీ పెళ్లిపీటలమీద ఎక్కి కూర్చున్నాడు, పిల్లనిచ్చిన వాళ్లూ వున్నారు. పెళ్లికి తర్లివచ్చిన వాళ్లూ వున్నారు. అందుకే ఆడబ్రతుకులు అడివి. అధ్వాన్నమునూ!